
క్లుప్తంగా

వరాహమూర్తిగా జగన్నాథుడు



వరాహమూర్తి అవతారంలో దర్శమిచ్చిన జగన్నాథుడు

కొమ్మాది: భీమిలిలో జరుగుతున్న జగన్నాథ స్వామి రథోత్సవ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వరాహ మూర్తి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు ఆర్.సింగరాచార్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు ఈ అవతారం గురించి వివరించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పార్కింగ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలపై ఆందోళన



ఆందోళన వ్యక్తం చేస్తున్న బీసీ కాలనీవాసులు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ కల్లివానిపాలెం బీసీ కాలనీలోని పార్కింగ్ స్థలంలో అక్రమ నిర్మాణాలపై స్థానికులు సోమవారం ఆందోళన చేపట్టారు. నిర్మాణాలను అడ్డుకుని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. 1999లో కాలనీ ఏర్పడినప్పుడు 97 మందికి ఇళ్లు కేటాయించి, సర్వే నంబర్ 205లో 55 సెంట్లు పార్కింగ్, కమ్యూనిటీ అవసరాల కోసం వదిలేశారని తెలిపారు. ఇటీవల ఆ స్థలంలో కొందరు నిర్మాణాలు చేపడుతుండటంతో నిరసన చేపట్టారు. భవిష్యత్తు అవసరాలకు వదిలిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పాడ ఎర్రమ్మ, పద్మ, పిల్లి మంగమ్మ, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో వసతులు కల్పించాలని వినతి

తగరపువలస: ఆనందపురం పంచాయతీలో 2018లో లాటరీ ద్వారా ఇళ్ల పట్టాలు కేటాయించిన లబ్ధిదారులకు వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేశారు. అప్పట్లో 85 మందికి ఇళ్లపట్టాలు ఇవ్వగా 20 మంది అతి కష్టం మీద ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. ఇప్పటి వరకు వీరికి తాగునీరు, రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించలేదన్నారు. దీనిపై సోమవారం సంబంధిత విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందించారు.

గొర్రెలకు నట్టల నివారణ మందులు

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పశువైద్యాధికారి జి.కాంతికిరణ్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జివలస పంచాయతీలో 300 గొర్రెలకు నట్టల నివారణ మందులు వేశారు. వర్షాకాలంలో రైతులంతా ఈ నట్టల నివారణ మందులు విధిగా తమ పశువులకు వేయించాలన్నారు. అనంతరం రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆటో కార్మికుల ధర్నా



మధురవాడ జోనల్ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ఆటో కార్మికులు

మధురవాడ: ప్రభుత్వ చర్యలు ఆటో కార్మికుల ఉపాధికి గండి కొట్టే విధంగా ఉన్నాయని సీఐటీయూ అనుబంధ విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం అధ్యక్షుడు పి.రాజ్ కుమార్ అన్నారు. ఆటో కార్మికుల ఉపాధికి రక్షణ కల్పించాలని కోరుతూ మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నా లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆగస్ట్ 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రకటించిందని, ఉచిత ప్రయాణం కల్పిస్తే ఆటో కార్మికుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన జీవో ఇచ్చే ముందు అఖిలపక్ష ఆటో యూనియన్లతో చర్చించి, వారి ఉపాధికి హామీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జి.చిన్నారావు, ఎం.రాము, ఎస్.బంగార్రాజు, కె.రాము, డి.రవి తదితరులు పాల్గొన్నారు.

నది చెంత తీరని నీటి చింత

అడుగంటిన భూగర్భ జలాలు



కొండపేట, గుడివాడ, చెరకుపల్లి గ్రామాల మధ్య విశాలమైన నదీ ప్రాంతంలో తుమ్మచెట్లు



నదిలో నీటిని నిలువ ఉంచే పూనిగట్టు శిథిలమై.. ఇలా

- డ్రైనేజీల అనుసంధానంతో గోస్తని జలం కలుషితం
- ఇసుక తవ్వకాలతో మాయమైన పరీవాహకప్రాంతం
- మొరాయిస్తున్న బోర్లు

తగరపువలస: చెంతనే గోస్తని నది ఉన్నా భీమిలి జోన్‌వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. తగరపువలస, చిట్టివలస, సంగివలస గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటి పోవడంతో వీధిబోర్లతో పాటు సొంతబోర్లు కూడా నీరు ఇవ్వకుండా మొరాయిస్తున్నాయి. కొత్తగా బోర్లు తవ్వించుకుందామన్నా గతంలో వంద అడుగులకే తగిలిన నీటి జాడ ప్రస్తుతం 300 అడుగులకు వెళ్లినా అందడం లేదు. ఇక అపార్ట్ మెంట్‌లలో నివసించేవారి పరిస్థితి మరింత ఘోరం. జూన్ ముగిసినా సరైన వానలు లేకపోవడం కూడా నీటి ఎద్దడికి కారణంగా కనిపిస్తోంది.

ఈ ప్రాంతాల్లో సమస్య అధికం

జాతీయ రహదారిని ఆనుకుని తూర్పువైపు నమ్మివానిపేట, సంగివలస, సంతపేట, చిట్టివలస, కార్మికవాడ, కొత్తపేట, ఆదర్శనగర్, వెలంపేట, విల్సన్‌పేట గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. విజయనగరం జిల్లాలోని తాటితూరు రిజర్వాయర్ నుంచి నీరు పుష్కలంగా విడుదలై గోస్తనినది పరవళ్లు తొక్కితే తప్ప, భూగర్భజలాలు పెరగవని స్థానికులు వాపోతున్నారు.

అనువైన ప్రాంతం వృథాగా..

సముద్రంలో రోజూ రెండుసార్లు సంభవించే ఆటుపోట్ల కారణంగా ఉప్పుటేరు మీదుగా నీరు మూలకుద్దు, చిట్టివలస, తగరపువలస గ్రామాలకు తాకుతుంది. ఈ ప్రాంతాలలో గతంలో ఎడాపెడా ఇసుకను తవ్వి పెద్ద గోతులు పెట్టేయడంతో తగరపువలస పాత వంతెన వరకు గోస్తనిజలాలు ఉప్పగా మారిపోయాయి. వందేళ్ల క్రితం చిట్టివలస జ్యూట్‌మిల్లు యంత్రాలు ఆవిరిపై నడవటం ప్రారంభమైనప్పుడు యాజమాన్యం నదిలో నీటికి రాళ్లతో కూడిన పూనిగట్టు నిర్మించి తద్వారా కృత్రిమ కోనేటిలో నిల్వ చేసి ఏడాది పొడవునా నీటిని వినియోగించేది. దీంతో జిల్లా సరిహద్దు ప్రాంతాలైన తగరపువలస, చిట్టివలస, గుడివాడ, చెరకుపల్లి, కొండపేట, మూలకుద్దు, మద్దిపేట, ఎరుసుపేట గ్రామాలను ఆనుకుని ఎత్తయిన ఇసుక దిబ్బలు వాటిలో మంచినీటిని సేకరించుకునేందుకు చెలమగొయ్యిలు ఉండేవి. ఇసుక కోసం తవ్వకాలు పెరిగి 1990 తరువాత ఇసుకతిన్నెలే మాయం అయిపోయాయి. రెండు జిల్లాల మధ్య కొండపేట, గుడివాడ, చెరకుపల్లి గ్రామాల మధ్య విశాలమైన నదీ పరీవాహక ప్రాంతం ప్రస్తుతం తుమ్మచెట్లతో నిండిపోయింది. ఇరువైపులా ఉన్న కొండల మధ్య వందలాది ఎకరాలలో కృత్రిమ రిజర్వాయర్ నిర్మిస్తే ఆ గ్రామాలకు తాగునీటి సమస్యే తలెత్తదు.

గుడివాడ, చిట్టివలస గ్రామాల మధ్య కిలోమీటరు మేర విశాలమైన ప్రదేశం ఉంది. నీటిని నిలుపుదల చేసేందుకు పాత పూనిగట్టు, చిట్టివలస–గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డులో చెక్‌డ్యామ్ నిర్మిస్తే ఉప్పునీరు ఎగువకు రాకుండా అడ్డుదల వేసి భూగర్భ జలాలు పెంచవచ్చు. గతంలో భీమిలి, భోగాపురం ఎమ్మెల్యేలు చెక్‌డ్యామ్ నిర్మిస్తామని ఇచ్చిన హామీలు గోస్తనిలో కలిసిపోయాయి.

'గోస్తని'.. మురుగుమయం

2014–19 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం తగరపువలస, చిట్టివలసలోని డ్రైనేజీలను నేరుగా గోస్తనినదికి అనుసంధానం చేయడంతో పాతవంతెన నుంచి దిగువకు కొత్త మూలకుద్దు వరకు నీరంతా మురుగుమయం అయిపోయింది. దీంతో నది పవిత్రత దెబ్బతినడమే కాకుండా, మురుగునీరు కలిసే ప్రాంతంలో చేపల వేట కూడా కష్టంగా ఉంటోంది. ఈ ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుని కృత్రిమ రిజర్వాయర్, చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తే ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు సముద్రంలో కలవనీయకుండా నిల్వ చేసి, భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోవచ్చు.



గుడివాడ, చిట్టివలస గ్రామాల మధ్య నదిలో మురుగునీరు

ఎంత లోతుకు వెళ్లినా నీటిజాడ లేదు



ఇటీవల సంగివలస నుంచి చిట్టివలస వరకు బోరు బావులు తవ్వేటప్పుడు ఎంత లోతుకు వెళ్లినా నీటి జాడ కనిపించడం లేదు. జూన్ ముగిసినా తాగునీటి సమస్య తీరలేదు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, కల్యాణమండపాలలో ఈ భూగర్భజలాల సమస్య తీవ్రంగా ఉంది.

– ఎ.నాగేశ్వరరావు, చిట్టివలస

మురుగు నీటిని మళ్లించాలి



ముందుగా గోస్తనినదిని సంరక్షించుకోవాలి. మురుగునీటిని నదిలోకి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాలలోకి మళ్లించాలి. ప్రస్తుతం తుమ్మచెట్లతో నిండిన ప్రదేశాన్ని లోతుగా చేసి నీరు నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలి. దీంతో భవిష్యత్తు అవసరాలకు నీరు ఉపయోగించుకోవచ్చు.

– వెంపాడ వెంకటరమణ, బంగ్లామెట్ట

చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి



గోస్తనినది ద్వారా దిగువకు వచ్చే నీరు సముద్రంలో కలవకుండా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. 25 ఏళ్లుగా నదిలో చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తామని ప్రజాప్రతినిధులు హామీలలోనే సరిపెట్టారు. తాగునీటి సమస్యకు చెక్‌డ్యామ్‌లే పరిష్కారం.

– సిమ్మల ప్రసన్న, కొత్తపేట

సర్పంచ్ ఆరోగ్యంపై చిన్న శ్రీను ఆరా



పద్మనాభంను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరం ఫోర్ట్: ఇటీవల ప్రమాదానికి గురై విజయనగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భీమిలి నియోజకవర్గం, పద్మనాభం సర్పంచ్ తాలాడ పద్మనాభంను విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. పద్మనాభం ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పద్మనాభం మండల ఎంపీపీ కె.రాంబాబు, యూత్ ప్రెసిడెంట్ బుగత సత్యనారాయణ, చీపురుపల్లి జెడ్పీటీసీ సభ్యుడు వలిరెడ్డి శ్రీను, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ ఉన్నారు.

జాబ్ మేళాలో 215 మంది ఎంపిక



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

కొమ్మాది: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో భీమిలి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఈ మేళాలో 12 కంపెనీలు పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహించాయి. మేళాకు 680 మంది యువతీ యువకులు హాజరు కాగా, 215 మంది ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా. మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి తక్షణ చర్యలు

- జోన్–1 జెడ్సీ అయ్యప్పనాయుడు
- పీజీఆర్ఎస్‌కు 9 అర్జీలు



వినతులు స్వీకరిస్తున్న అయ్యప్ప నాయుడు

కొమ్మాది: జీవీఎంసీ భీమిలి జోన్–1 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చాయి. జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగం– 4, ప్రజారోగ్య విభాగం–2, పట్టణ ప్రణాళిక విభాగం–2, యూసీడీ విభాగానికి–1 చొప్పున మొత్తం 9 అర్జీలు అందాయి. ఈ అర్జీల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జెడ్సీ అయ్యప్పనాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు.

జోన్–2లో 18 అర్జీలు

మధురవాడ: మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం జెడ్సీ కె.కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 18 అర్జీలు వచ్చాయి. ఇందులో టౌన్ ప్లానింగ్–4, ఈఈ వర్క్స్–05, వాటర్ సప్లై–1, పబ్లిక్ హెల్త్–4, ఎలక్ట్రికల్–2, యూసీడీ, యూజీడీల నుంచి ఒక్కొక్కటి చొప్పులు అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

విపత్తు నిర్వహణపై ముగిసిన శిక్షణ



శిక్షణలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి బహుమతి అందజేస్తున్న పద్మనాభరాజు

పీఎం పాలెం: విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు రక్షణగా పోలీస్ యంత్రాంగం నిలుస్తుందని బక్కన్నపాలెం ఏపీఎస్పీ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు అన్నారు. విపత్తు వేళ ప్రజల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోలీసుల విధులపై బెటాలియన్‌లో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ విపత్తుల నుంచి ప్రజలను కాపాడడంలో పోలీస్ యంత్రాంగం కీలక పాత్ర వహిస్తుందన్నారు. వరదల సమయంలో బోట్ల ప్రాధాన్యత, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలు వివరించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా శిక్షణలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ పి.సత్యం, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీధర్, రామకృష్ణ, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



మృతుడు శ్రీనివాసరావు

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు కొత్తపేటకు చెందిన ఆర్.శ్రీనివాసరావు (49) మద్యం మత్తులో సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిని గమనించిన శ్రీనివాసరావు బంధువులు కొనఊపిరితో ఉన్న ఆయనను సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాసరావు మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భీమిలి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం



మోహనరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు



అక్కులును సన్మానిస్తున్న పాండ్రంగి హైస్కూల్ ఉపాధ్యాయులు

మధురవాడ: విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో స్కూల్ అసిస్టెంట్ కేవీ మోహనరావు సేవలు అభినందనీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా మోహనరావుకు ప్రధానోపాధ్యాయుడు వెంకటరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబద్ధత గల ఉపాధ్యాయుడు 'అక్కులు'

పద్మనాభం: పాండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పనిచేసి, పదవీ విరమణ పొందిన కాళ్ల అక్కులకు సోమవారం పాఠశాల ప్రాంగణంలో ఘన సన్మానం జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ అక్కులు ఉపాధ్యాయుడిగా నిబద్ధతతో పని చేశారన్నారు. శిర్లపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అక్కులు చొరవ వల్ల ఏర్పడిందన్నారు. దీనిలో భాగంగా అక్కులును రాజకీయనేతలు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించి, మొమెంటోలు అందజేశారు. పాండ్రంగి హైస్కూల్ హెచ్‌ఎం ఆర్‌వీ గిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి ఎంవీ కృష్ణకుమార్, ఉపాధ్యాయ సంఘ నాయకులు రెడ్డిపల్లి జగదీష్‌బాబు, అవనాపు అరుణ్ కుమార్, బోని సూర్యనారాయణ, పలు హైస్కూళ్ల హెచ్‌ఎంలు విజినిగిరి శంకరరావు, ఎ.బాలామణి, బి.అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు అముజూరి అప్పారావు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పద్మనాభం: రేవిడిలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక విజయరాంపురం కమిటీ సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం చేశారు. భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు పైడన్న, మంగమ్మ, అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

వ్యర్థాలు చెరువులో కలవకుండా..

అడ్డుకట్ట వేసిన మత్స్యకారులు



చెరువుకు, తాత్కాలిక కాలువకు మధ్య ఇనుప తెరలు కడుతున్న సంప్రదాయ మత్స్యకారులు

తగరపువలస: చిట్టివలస పెద్ద చెరువుకు దానికి సమాంతరంగా ఉన్న తాత్కాలిక కాలువకు మధ్య సోమవారం తాటితూరు స్వదేశీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఇనుప తెరలను ఏర్పాటు చేశారు. కాలువ ద్వారా వివిధ గ్రామాల నుంచి ప్రవహిస్తున్న పాలిథిన్ తదితర వ్యర్థాలు చెరువులో పేరుకుపోయి, దుర్గంధానికి కారణం కావడంతో పాటు చేపల దిగుబడి తగ్గిపోవడంతో ఈ చర్యలు చేపట్టినట్టు జిల్లా మత్స్యకార సహకార సంఘం మాజీ వైస్ చైర్మన్ సింగిడి గణేష్ తెలిపారు. వాస్తవానికి ఈ పని జీవీఎంసీ చేయవలసి ఉన్నా, తమ సభ్యులంతా పూనుకుని ప్రక్షాళన చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో సహకారం సంఘం డైరెక్టర్లు ఆబోతుల నాగేశ్వరరావు, సిద్ధాంతపు రవి, సభ్యులు సింగిడి అప్పారావు, ఇంటి ఎల్లయ్య, సింగిడి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 6 గంటల నుంచే వైన్‌షాపు..

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ కూడలి నుంచి బంటుపల్లి కళ్లాల రోడ్డులో వైన్‌ షాపు ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే తెరుస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. దీనిపై చుట్టుపక్కల వారు అభ్యంతరాలు తెలియజేస్తున్నా, తాము భీమిలి ఎమ్మెల్యే తాలూకా అని చెబుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే తాలూకా అయితే వైన్ షాపులకు వేళాపాళా ఉండదా అని ప్రశ్నిస్తున్నారు. వేములవలస మార్కెట్ వేకువజామునే ప్రారంభం అవుతున్నందున వైన్‌షాపును కూడా అదే సమయంలో తెరవడం బాగాలేదని ఇక్కడి వారు అంటున్నారు. భీమిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పరిశీలించి, వైన్‌షాపు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.